క్లుప్తంగా

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న బాబురాజు

ఆదోని టౌన్: క్షయవ్యాధిని నివారిద్దామని, అందుకు ప్రతిఒక్కరు తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు కోరారు. మంగళవారం శంకర్‌నగర్, అరుంజ్యోతి నగర్‌లోని వార్డు సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రజలకు టీబీ (క్షయ) నివారణపై అవగాహన కల్పించారు. టీబీ నమోదైన వ్యాధిగ్రస్థులకు ఆరు నెలలకు సరిపడే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. అలాగే వారి పోషణకై నెలకు రూ.500 చొప్పున చెల్లిస్తుందన్నారు. పుట్టిన బిడ్డకు ఈసీజీ వేయించాలని, తుమ్మినా, దగ్గినా మోచేయిని అడ్డుగా పెట్టుకోవాలని, మాస్కు ధరించాలన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



అంగన్‌వాడీ సెంటర్‌-2 వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌-2 వద్ద తాగునీటి సౌకర్యం లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నానా ఇబ్బందులు పడేవారు. అంగన్‌వాడీ కార్యకర్త థెరిసమ్మ సమస్యను సర్పంచ్ రామాంజినేయులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామ చివరన ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు గర్భిణులు, బాలింతలు కృతజ్ఞతలు తెలిపారు.

మాధవరం హెచ్‌ఎంగా భోజరాజు



మంత్రాలయం: నందవరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.భోజరాజుకు హెచ్‌ఎంగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భోజరాజును మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నియమించారు. బుధవారం మాధవరం హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డను చూపుతున్న 108 ఈఎంటీ మనోహర్

కోసిగి: కౌతాళం మండలం హాల్వి గ్రామానికి చెందిన ఈరన్న భార్య మీనాక్షిని మంగళవారం రాత్రి ప్రసవం కోసం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ఆంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. ఈఎంటీ మనోహర్ ఆమెకు వైద్య సాయం అందించగా ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను కోసిగి ఆస్పత్రిలో చేర్చారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపరు. మీనాక్షికి ఇది మూడో కాన్పు.

రాజగోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి మంగళవారం ఓ భక్తుడు రూ.1,00,051 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. కౌతాళం వాస్తవ్యులు తులసమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండును అందజేశారు.

బావికి కంచె ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలోని 21వ వార్డు సచివాలయం పరిధిలోని బావి ప్రమాదకరంగా మారిందని, వెంటనే కంచె ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మన్న కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బావికి కంచె లేకపోవడంతో అటుగా వెళ్లే ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదం జరగకముందే కంచె ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సచివాలయం పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లోని ప్రభుత్వ స్కూల్‌కు నాడు-నేడు పనుల కింద కాంపౌండ్ వాల్ నిర్మించాలని, ఎస్‌కేడీ కాలనీలో ఉన్న పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పన్నెండేళ్ల సమస్య పరిష్కారం



నా పేరు చంద్ర వీరవేణి. భర్త రామరావు మృతి చెంది 12 సంవత్సరాలు అయ్యింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం గతంలో ఎన్నో సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగివేసారిపోయాను. ఇక సర్టిఫికెట్ రాదేమో అనుకున్నాను. ఈ విషయం ఇటీవల వలంటీరుకు చెప్పగా వివరాలు నమోదు చేసుకున్నారు. మంగళవారం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చి ఇచ్చారు. జగనన్న పాలనలో ఇంత త్వరగా సర్టిఫికెట్ వస్తుందని ఊహించలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంతో నా కష్టం తీరింది.

ఆరేళ్ల తర్వాత రేషన్ కార్డు వచ్చింది



ఈ ఫోటోలో కనిపిస్తున్న దంపతుల పేర్లు చాగి కొరవయ్య, అంజినమ్మ. వీరికి ఆరేళ్ల క్రితం వివాహం అయ్యింది. యువతిది కర్ణాటక రాష్ట్రం రాజోలి గ్రామం. పలుమార్లు రేషన్ కార్డు మంజూరు చేయాలని విన్నవించారు. వేరు రాష్ట్రం కావడం, ఈ-కేవైసీ కాకపోవడంతో చాల ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డు మంజూరైంది. సొంత కార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

నా మనవరాలికి బర్త్ సర్టిఫికెట్ వచ్చింది



నా పేరు తిమ్మాపురం అంజినయ్య. దుద్ది గ్రామంలో నివాసం ఉంటున్నాం. నా మనుమరాలు నాగలక్ష్మి(11)కి బర్త్ సర్టిఫికెట్ కోసం జగనన్న సురక్ష కార్యక్రమం దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే మంజూరు చేశారు. పుట్టిన వెంటనే నమోదు చేసుకోకపోవడంతో బర్త్ సర్టిఫికెట్ కోసం చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం సీఎం జగనన్న పాలనలో ఒక్కరోజులోనే బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

– తిమ్మాపురం అంజినయ్య, దుద్ది

కౌలు కార్డు ఇచ్చారు



నా పేరు వందగల్లు ఈరన్న, దుద్ది గ్రామం. జక్కల తిమ్మక్కకు చెందిన 1.77 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నాను. దాదాపు 20 ఏళ్లుగా కౌలు రైతుగా జీవనం సాగిస్తున్నా. గతంలో ఎన్నడు కౌలు కార్డు ఇవ్వలేదు. ఎలాంటి ప్రభుత్వ సాయం అందేది కాదు. ప్రస్తుతం కౌలు కార్డు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం నుంచి రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, పంట నష్ట పరిహారం వస్తుందని చెప్పారు. ప్రభుత్వ సాయం అందుతుందని సంతోషంగా ఉంది.

– వందగల్లు ఈరన్న, దుద్ది గ్రామం

సురక్షతో సులభంగా ధ్రువపత్రాలు



ఆదోనిలో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్ రెడ్డి



సంతెకూడ్లూరులో సర్టిఫికెట్లను అందుకున్న లబ్ధిదారులతో అధికారులు

ఆదోని టౌన్: అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత అన్నారు. మంగళవారం పట్టణంలోని 4, 5, 6, 7, 8, 18, 19 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఆదోని పట్టణంలో వివిధ ధ్రువపత్రాలు, సేవల కోసం 4,282 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 3,545 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఎక్కువగా కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మహిళా కౌన్సిలర్లు, కౌన్సిలర్లు, మేనేజర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో ఎంపీపీ బడాయి దానమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారు. మొత్తం 1003 మంది లబ్ధిదారులకు కుల, ఆదాయ, కౌలు హక్కు తదితర ధ్రువపత్రాలు అందజేశారు.

కౌతాళం: దశాబ్దాల కాలం నాటి సమస్యలకు జగనన్న సురక్ష పథకం పరిష్కారం చూపిందని ఎంపీపీ అమరేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుంబళనూరు గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి బృందం, వల్లూరులో ఎంపీడీఓ సుబ్బారాజు బృందం ప్రజల దరఖాస్తులను పరిశీలించి అక్కడికక్కడే వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 586 మందికి టోకెన్లు ఇవ్వగా 391 మంది లబ్ధిదారులకు అప్పటికప్పడే వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరు చేశారు.

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ, కోసిగి సచివాలయం-2లో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కోసిగి-2 సచివాలయం పరిధిలో 260 దరఖాస్తులకుగానూ 157, దుద్ది గ్రామంలో 362కు గానూ 299 అర్జీలను పరిష్కరించారు. జేసీఎస్ మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో సచివాలయం - 1లో ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యాక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి చేతులమీదుగా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 152 మందికి సర్టిఫికెట్లు అందించారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



పనుల పురోగతిపై ఎంఈఓతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్/ఆదోని సెంట్రల్: సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ ఒకేషనల్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి నైపుణ్యతను గమనించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. కంప్యూటర్ తరగతులకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసి విద్యార్థులకు కంప్యూటర్ మెలకువలు నేర్పించాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఎంఈఓ శివరాముడు, ప్రిన్సిపాల్ బి.అంజలీదేవి, మండల సర్వేయర్ రమణ, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆదోని అర్బన్: ప్రతినెలా 14వ తేదీలోపు వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలని, లేకపోతే సర్ చార్జీలు తప్పవని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సర్ చార్జీలు పడకుండా వినియోగదారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే టిడ్కో గృహాలకు మీటర్లు బిగించామని, వారు ఇంతవరకు విద్యుత్ బిల్లులు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని కోరారు. విద్యుత్‌లో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సమస్యలు వస్తే అధికారులను సంప్రదించాలన్నారు. పట్టణంలోని డీ1 సెక్షన్ ఏఈ ఫోన్ నంబర్లు 08512 253535, 9440813381, డీ2 సెక్షన్ 08512 252376, 9440813382, డీ3 సెక్షన్ 08512 252277, 9440813383, ఆదోని రూరల్ ఏఈ 9440813384, కౌతాళం మండలం 9493193228 నంబర్లను సంప్రదించాలన్నారు. పై నంబర్లలో విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలిగితే 9440813339 (ఏడీఈ పురుషోత్తం) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఎల్లమ్మవ్వ జాతర



ప్రత్యేక అలంకరణలో రేణుకాఎల్లమ్మ



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

ఆదోని అర్బన్: ఆషాడ మాసం మూడో మంగళవారం సందర్భంగా యల్లమ్మవ్వ కొండలో వెలసిన రేణుక ఎల్లమ్మవ్వకు గంగ జాతర ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అవ్వవారికి అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కొండ ప్రాంతంలో పిండి వంటలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే ఇంటి నుంచి పిండి వంటలు తెచ్చుకొని కొండ ప్రాంతంలో వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆహ్లాదంగా గడిపారు.

విద్య కార్పొరేటీకరణపై పోరాటం



జెండాను ఆవిష్కరించి తరగతులను ప్రారంభిస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్: విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐఎస్‌ఎఫ్‌జాతీయ కార్యదర్శి జి.రంగన్న, రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మంత్రాలయం హెచ్‌ఆర్‌బీ కల్యాణ మండపంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ కార్యక్రమం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన ప్రారంభమైంది. ముందుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై వ్యక్తలు ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. దేశంలో నూతన విద్యా విధానం తీసుకొచ్చి పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. వివిధ వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద భారీగా కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసు అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సోమశేఖర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. రచ్చమర్రి గ్రామానికి చెందిన పల్లెపాడు లక్ష్మయ్య, కడతట్ల వీరేష్, ఎమ్మిగనూరు మండలం గుడేకల్లుకు చెందిన బోయ యువరాజు కారులో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారు. చెక్ పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా వారిని పట్టుకుని కారులో ఉన్న 21 బాక్సుల మద్యం 2,016 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ((90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.1,05,000 ఉంటుందని తెలిపారు. కారును సీజ్ చేశారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్, గోపాల్, లింగప్రసాద్, షరీఫ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

ఆదోని రూరల్: మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ బబంజరు, పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని దొడ్డనకేరి, పాండవగల్లు, బసరకోడు, పెద్ద తుంబళం, సంతకూడ్లూరు, ఆనువాల్ తదితర గ్రామాల్లో చాలామంది పేదలు ప్రభుత్వ పోరంబోకు, కొండ పోరంబోకు, బంజరు భూములు కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, నాయకులు లక్ష్మన్న, రామాంజనేయులు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత 'భుజానికెత్తుకొని'!



దెంతెను లాగుతున్న మోదీన్ సాబ్

మంత్రాలయం రూరల్: నాన్న డబ్బులు ఇవ్వలేదని, సెల్‌ఫోన్ చూస్తుంటే అమ్మ కోప్పడిందని పిల్లలు అలుగుతున్న రోజులివి. తమ కష్టం బయటకు కనిపించకుండా పిల్లలను లక్షలు పోసి చదివిస్తున్నా తల్లిదండ్రులు ఇంకా తమకేమీ చేయడం లేదనే నిరుత్సాహం కనిపిస్తుంది. కానీ ఈ యువకుడు అందుకు భిన్నం. తనకు చదువుకోవాలనే ఆశ ఉన్నా.. అందరిలా కళాశాలకు వెళ్లి తన భవితకు బాటలు వేసుకోవాలనుకున్నా.. బాధ్యత ఇంటి పట్టునే ఉంచింది. నడక నేర్పిన నాన్న మంచానికే పరిమితం కాగా.. అన్నం పెట్టిన సేను బీడు కాకుండా పెద్ద కుమారునిగా కుటుంబ పోషణకు నడుం బిగించాడు. ఇంటర్‌తో చదువు ఆపేసి వ్యవసాయం చేసి తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వివరాలివీ.. సుంకేశ్వరి గ్రామానికి చెందిన పి.రంజాన్, రమిదాబీ దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలకు వివాహాలు చేయగా.. మూడో కుమారుడు మోదీన్‌సాబ్ ఇంటర్ పూర్తి చేశాడు. చివరి కుమారుడు బాషా చిన్నాచితక పనులు చేస్తున్నాడు. రంజాన్ పుట్టుకతోనే దివ్యాంగుడు కాగా.. ఏడేళ్ల క్రితం బీపీ పెరిగి పక్షవాతం రాగా మంచానికే పరిమితం అయ్యాడు. వీరికి మూడు ఎకరాల పొలం ఉండగా.. ఆడ పిల్లల పెళ్లిళ్లు, కుటుంబ పోషణకు 1.50 ఎకరాలను అమ్మేశారు. ఉండటానికి మట్టి మిద్దె మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో తండ్రి ఆలనాపాలనతో పాటు వ్యవసాయం, కుటుంబ పోషణ భారం మోదీన్‌సాబ్‌పైనే పడింది. దీంతో రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ బైపీసీ పూర్తి చేసినా అంతటితో ఆపేశాడు. వ్యవసాయంతో పాటు గ్రామంలో చిన్నాచితక విద్యుత్ పనులు చేస్తున్నాడు. ప్రస్తుతం బోరు కింద పత్తి పంట సాగు చేయగా, నీటి తడులు ఇచ్చేందుకు కాలువలు చేస్తున్నారు. గెడానికి రూ.1000 చెల్లించాల్సి ఉండటంతో తల్లీకొడుకు స్వయంగా దెంతె పట్టి కాలువలు తీసుకున్నారు.

అడ్మిషన్లకు నేడు ఆఖరు

ఆదోని సెంట్రల్: స్థానిక డిగ్రీ కళాశాల అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు బుధవారం ఆఖరు తేదీ అని ఆదోని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా మంగళవారం తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ కావాలనుకునే విద్యార్థులు నేడు సాయంత్రం 5 గంటల్లోపు రిజిష్టర్ చేసుకోవాలన్నారు. రిజిష్టర్ చేసుకున్న వారు 7వతేదీ నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలను ఎంచుకోవాలని సూచించారు. 16 వతేదిన కళాశాలల అలాట్‌మెంట్ జరుగుతుందని పేర్కొన్నారు.

గురువులకు సన్మానం

పెద్దకడబూరు: గురుపౌర్ణమి సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరసింహాచారి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లా కందిమల్లయ్య పల్లెలో వెలసిన బ్రహ్మంగారి మఠంలో బ్రంహ్మేంద్రస్వాముల వారి వంశస్తుడు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతులు వెంకటాద్రి స్వాముల వారిని, వారి శిష్యులను, ఈశ్వరిదేవి మఠాధిపతులు వీర శివకుమార్ స్వాముల వారిని మంగళవారం బ్రహ్మంగారి మఠంలో కలసి శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కడిమెట్ల గ్రామం విశ్వబ్రాహ్మణులు నాగరాజాచారి, శ్రీనివాసాచారి, దొడ్డిమేకల శివ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

బాధిత రైతుకు న్యాయం చేయాలి

మంత్రాలయం రూరల్: మండలంలోని చౌలహళ్లి గ్రామంలో సర్వే నంబరు 19బీ1 ఏలో 2.89 ఎకరాల భూమి గత 50 ఏళ్లుగా గ్రామానికి చెందిన హరిజన ముత్తమ్మ, నరసన్నలు సాగుచేసుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు బొగ్గుల తిక్కన్న పేర్కొన్నారు. మంగళవారం ఆ కుటుంబ సభ్యులతో కలిసి పొలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సాగుభూమిలో కొందరు అక్రమంగా ప్లాట్లు వేసుకోవాలని చూస్తే హైకోర్టును ఆశ్రయించారన్నారు. 2022 డిసెంబరు 13న భూమిలో పంటల సాగుకు ఆటంకం కలగించరాదని కోర్టు తీర్పునిచ్చినట్లు తెలిపారు. అయితే స్థానిక అధికారులు మాత్రం గ్రామస్తులను రెచ్చగొట్టి పంపుతున్నారని ఆరోపించారు. దౌర్జన్యానికి పాల్పడిన వారిపై మాధవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, తగిన చర్యలు తీసుకొని బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధం కావడంతో రూ.30 వేల ఆస్థినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన గద్దెన్న తన ఇంటి పక్కనే స్థలంలో పశువుల కోసం గడ్డివాము వేసుకున్నాడు. పక్కనున్న విద్యుత్ స్తంభం నుంచి షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగడంతో గడ్డివామి కాలిపోయింది. గ్రామస్తులు మంటలను అదుపుచేశారు.

న్యాయవాదుల ఆందోళన



భీమాస్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆదోని టౌన్: ఆదోనిలో త్రీటౌన్ పోలీసుల చర్యకు నిరసనగా మంగళవారం న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. బార్ అసోసియేషన్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి భీమాస్ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. అక్కడి నుంచి ప్రదర్శనగా డీఎస్పీ బంగ్లాకు చేరుకున్నారు. న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నినదించారు. డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో బంగ్లాలోని అధికారులకు వినతిపత్రం అందజేసి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితాబాయి, ఉపాధ్యక్షురాలు కవితరాణి, ట్రెజరర్ ముగ్దుమ్‌అజీమ్, మహిళా ప్రతినిధి లావణ్య, తదితరులు మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయంపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన శ్రీనివాసరెడ్డి, కళ్యాణ్‌రెడ్డిపై ఎస్‌ఐ, సిబ్బంది దురుసుగా వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. పోలీసులు నియంత ధోరణి వీడనాడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాధికారి శేషాద్రి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపకుండానే తమపై అక్రమ కేసు బనాయించడం దారుణమన్నారు. అక్రమ కేసును ఎత్తివేయాలని, దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీ



బిర్యానీ హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎంఎం రోడ్డు, కొత్త బస్టాండు రోడ్డులోని హోటళ్లను, ఆయిల్ దుకాణాలను మంగళవారం సాయంత్రం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎం రోడ్డులోని హైదరాబాద్ దమ్ బిర్యానీ హోటల్‌లో కలర్ కోటింగ్, నాణ్యత, ఫుడ్ పరిమానాన్ని పరిశీలించారు. ఆహారం శాంపుల్స్ తీసుకున్నారు. అలాగే ఆ రోడ్డులోని ఆయిల్ దుకాణంలో ఆయిల్ నాణ్యత, పరిమాణాలను పరిశీలించి శాంపిల్స్‌ను తీసుకున్నారు. కొత్త బస్టాండు రోడ్డులోని దుకాణాల్లో తనిఖీలు చేసి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్ టెస్టింగ్ కోసం పంపుతున్నట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యత లేకుండా ఆయిల్, ఇతర ఆహార పదార్థాలు అమ్మినా, హోటల్ అపరిశుభ్రంగా ఉన్నా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం పెద్దహోతూరు గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడి మంగళవారం రాత్రి ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు ఆదోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దహోతూరు గ్రామానికి చెందిన విజయ్, లింగయ్య వారి పని ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో గాయాల పాలయ్యారు. వారిని మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన వీరేష్ గౌడు ఇంట్లో కరెంట్ షాక్‌కు గురై అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఇంట్లో స్విచ్ వేస్తుండగా కరెంట్ షాక్‌కు గురైనట్లు బంధువులు తెలిపారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలంలో సూగూరు, బూదూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరీ పేర్కొన్నారు. ఇప్పటికే వాలంటీర్లు గ్రామంలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల వివరాలు నమోదు చేశారన్నారు. అధికారులు, నాయకులు దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

కౌతాళం: మండలంలో పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 8415 మందికిగాను మంగళవారం వరకు 8233 మందికి (97.84 శాతం) పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా వారికి రెండు రోజుల్లో పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

మన్యం వీరుడికి నివాళి

మంత్రాలయం రూరల్: మంత్రాలయం ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గర్జి హనుమన్న, నరసింహులు, అనిల్, తిమ్మారెడ్డి, లక్ష్మన్న, రామచంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.